26022025-DIS-04_Layout 1 2/26/2025 2:38 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## స్టాక్ మార్కెట్లో కల్లోలం

**స్టాక్ మార్కెట్ల** పతనం నిరవధికంగా కొనసాగుతూనే ఉన్నది. నిన్నటి సోమవారం మరో 'బ్లాక్ మండే' నమోదైంది. నిజానికి గత వారం రోజులుగా షేర్ మార్కెట్ నేల చూపులు చూస్తూనే ఉన్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌ల యుద్ధం ఈ పతనానికి ఆజ్యం పోస్తున్నది. టారిఫ్ కీచులాటలతో పాటుగా అమెరికా మాంద్య భయాలు మార్కెట్లను వణికిస్తున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపుపై సంప్రదింపులు జరుగుతున్నాయన్న వార్తలు కూడా మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్‌ఐఐ) భారత్ నుంచి పెట్టుబడులను నిరంతరంగా తరలిస్తూనే ఉన్నారు. ఈ నెలలోనే రూ.23 వేల కోట్లకు పైగా భారతీయ వాటాలను ఎఫ్‌ఐఐలు వదిలించుకున్నాయి. ఈ ఏడాది రెండు నెలలను కలిపితే రూ.లక్ష కోట్లకు పైనే పెట్టుబడుల ఉపసంహరణ జరిగింది. ఎఫ్‌ఐఐల అమ్మకాల జోరు, ట్రంప్ టారిఫ్‌ల బెదురు గత కొన్నిరోజులుగా మార్కెట్లను కృంగదీస్తున్నాయి. గత శుక్రవారం వాల్ స్ట్రీట్‌కు చెందిన డౌజోన్స్ సూచీ 1.71 శాతం కృంగిపోయింది. సహజంగానే ఈ సెంటిమెంట్ల ప్రభావం భారత్‌పై పడుతున్నది. రూపాయి విలువ నిరంతరంగా పడిపోవడం, మూడో త్రైమాసిక ఫలితాలు బలహీనంగా ఉండటం, డాలరు నిల్వలు తరిగిపోతుండటం, వాణిజ్యలోటు పెరుగుతుండటం మదుపరుల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నది. సెన్సెక్స్ ఒక్కరోజే 857 పాయింట్లు, నిఫ్టీ 243 పాయింట్లు నష్టపోయాయి. ఫలితంగా రూ.4.23 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరైపోయింది. మరోసారి పతనమైతే 28 ఏండ్ల నాటి రికార్డు బద్దలైపోతుందని అంచనా. ఇక దలాల్ స్ట్రీట్ వరుసగా ఐదు నెలల పాటు పతనం కావడమన్నది 1996 తర్వాత ఇప్పుడే మొదటిసారి.

స్టాక్ మార్కెట్ల పతనం వల్ల మదుపరులు ప్రత్యామ్నాయ పెట్టుబడి అవకాశాల కోసం అన్వేషిస్తున్నారు. వ్యూహాలను మార్చుకుంటున్నారు. రిస్కులతో కూడిన అధిక లాభాల మార్గాలు భయపెడుతుండటంతో తక్కువ రిస్క్, తక్కువ లాభం కలిగించే ఎఫ్‌డీ వంటివి ఎంచుకుంటున్నారు. వారికి ధగ ధగ మెరిసే పచ్చని లోహం ఆకర్షణీయ ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నది. దీంతో బంగారం ధర మళ్లీ పుంజుకుంటున్నది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో పది గ్రాముల బంగారం ధర రూ.350 పెరిగి రూ.89,100కి చేరుకున్నది. మార్కెట్ అస్థిరతల కారణంగా మదుపరులు సురక్షితమైన బంగారం వైపు మళ్లడంతోనే ధర పెరుగుతున్నదనేది వాస్తవం. గత ఏడాది బంగారంపై పెట్టుబడి పదిశాతం కన్నా ఎక్కువే లబ్ధి కలిగించింది. ఈ ధోరణి మరికొన్నాళ్లపాటు ఇలాగే కొనసాగడం ఖాయంగా కనిపిస్తున్నది.

చైనాతో పోలిస్తే భారతీయ మార్కెట్లు కొంత వెనుకబాటు ప్రదర్శిస్తున్నాయి. వివిధ ప్రోత్సాహకాల కారణంగా ఎఫ్‌ఐఐలు చైనాకు తరలిపోతున్నాయి. ఏడాది కాలంలో ఇండియా మార్కెట్ క్యాపిటలైజేషన్ లక్ష కోట్ల డాలర్లు తగ్గిపోతే, అదే సమయంలో చైనా రెండు లక్షల కోట్ల డాలర్లు పెంచుకోవడం గమనార్హం. ఇండియా వాటాలు అమ్మేయ్ చైనా వాటాలు కొనేయ్ అనే ధోరణి మరికొంతకాలం కొనసాగవచ్చునని అంటున్నారు. 2024లో చైనా ప్రకటించిన మార్కెట్ ప్రోత్సాహకాలు దీనికి కారణమనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. భారత్ కూడా ఆర్థికరంగంలో వేగం పెంచేలా సంస్కరణలను వేగవంతం చేయాలి. ఆర్థికవృద్ధి, కార్పొరేట్ లాభాల పెంపు సాధిస్తేనే ఎఫ్‌ఐఐలు మరోసారి ఇటుగా దృష్టి మళ్లించి మార్కెట్ మళ్లీ పుంజుకుంటుంది.

## మేడిగడ్డ, ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదాలు

# కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణి

**2023, అక్టోబర్ 21 రాత్రి మేడిగడ్డ 7వ బ్లాకులో పియర్స్ కుంగిన ఘటన, గత శనివారం ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ బోర్ యంత్రంపై సీపేజ్ రాకుండా పై భాగంలో కాంక్రీట్ చేస్తున్నప్పుడు ఒక్కసారిగా పైకప్పు కూలి మట్టి, బండరాళ్లు, భారీగా వరద నీరు ఉధృతంగా రావడంతో 8 మంది ప్రమాదంలో చిక్కుకున్న ఘటన రెండూ కూడా ప్రకృతి వైపరీత్యంగానే చూడాల్సి ఉంటుంది. ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం, గత ప్రభుత్వాలదే బాధ్యత అంటూ కేసీఆర్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం కాంగ్రెస్ పాలకులు చేస్తున్నారు.**

**ఈ దుర్బుద్ధిని మానుకొని ప్రకృతి వైపరీత్యాల వల్ల జననష్టం జరిగిన సందర్భాల్లో సంయమనంతో వ్యవహరిస్తూ ప్రతిపక్షాన్ని విశ్వాసంలోకి తీసుకొని సమస్యను శాస్త్రీయంగా అర్థం చేసుకోవడానికి, పరిష్కారాలు కనుగొనడానికి పాలకపక్షం ప్రయత్నించాలి. భవిష్యత్తులో ప్రమాదాలు పునరావృతం కాకుండా గుణపాఠాలు తీసుకుంటూ చర్యలు చేపట్టవలసి ఉంటుంది.**



**వి.ప్రకాశ్**



ఎస్‌ఎల్‌బీసీ దుర్ఘటన బాధాకరం. ప్రపంచంలోనే మునుపెన్నడూ చేపట్టని భారీ ప్రాజెక్టులు చేపట్టినప్పుడు ఇలాంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టులో ప్రపంచంలోనే అత్యంత పొడవైన (43.93 కి.మీ.) సొరంగం తవ్వుతున్నారు. ఈ టన్నెల్ శ్రీశైలం డ్యాంకు 4 కి.మీ. ఎగువన గల రిజర్వాయర్ నుంచి డిండి లోయ దాకా ఉంటుంది. దీని (డయా) 9.2 మీ. ఈ మొత్తం సొరంగం టైగర్ రిజర్వ్ ఫారెస్టులో ఉండటం, పైన నల్లమల ఎత్తయిన గుట్టలు విస్తరించి ఉండటంతో మధ్య మధ్యలో మట్టి, రాళ్ళు వెలుపలికి తీయడానికి 'ఆడిట్' ఏర్పాట్లకు అవకాశం లేనందున సుమారు 130 మీ.పొడవైన రెండు టన్నెల్ బోర్ మెషిన్స్ (టీబీఎం)ను అమెరికా నుంచి తెప్పించడం జరిగింది. ఈ యంత్రంతో పనులు కొనసాగించిన అనుభవం మన ఇంజినీర్లకు గతంలో లేదు. వెలిగొండ ప్రాజెక్టులో రెండు టన్నెల్స్ తవ్వకాల్లో కూడా టీబీఎంలనే వినియోగించారు. ఈ రెండు టన్నెల్స్ పొడవు 22 కి.మీ, 23 కి.మీ. ఈ రెండు సొరంగాల పైన కూడా నల్లమల టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఉండటం వల్ల టీబీఎంలను ఒకటి జర్మనీ నుంచి మరొకటి అమెరికా రాబిన్‌సన్ కంపెనీ నుంచీ కొన్నారు. గట్టిరాయి ఉన్న సొరంగాల్లో, ఆడిట్‌కు అవకాశం లేని దగ్గరే టీబీఎంలను వినియోగిస్తారు. అక్కడక్కడ గట్టిరాయి లేనిదగ్గర వదులుగా ఉన్న మట్టి పొరలు, మొరం భూమి, భారీ సీపేజ్ వంటివి వస్తుంటాయి. వెలిగొండ టన్నెల్‌లో కూడా ఇలాంటి సమస్య తలెత్తినప్పుడు పనులు ఆపి ప్రపంచవ్యాప్తంగా అనుభవం గల నిపుణులను రప్పించి ఆ సమస్యను పరిష్కరించి పనులు కొనసాగించారు.

శ్రీశైలం ఎడమ కాల్వ సొరంగంలో కొద్దిరోజుల క్రితం టీబీఎంతో తవ్వకాలు పునః ప్రారంభించినప్పుడు ఈ నిపుణులను రప్పించి ఉంటే ఇప్పటి ఈ ప్రమాదాన్ని బహుశా నివారించి ఉండగలిగేవాళ్లమేమో! ఈ ప్రాజెక్టును తొందరగా పూర్తిచేయాలనే మంత్రుల ఒత్తిళ్ల వల్ల ప్రపంచ అనుభవజ్ఞులను రప్పించలేకపోయారనే విమర్శ వినవస్తున్నది. సుమారు 8 వేల లీటర్ల నీరు రోజూ 'ఊటల్లా ఉబికి వస్తుంటే తమ ప్రతిభతో ఈ జల పరిమాణాన్ని రోజూ 3 వేల లీటర్లకు తగ్గించగలిగారు. ఈ విజయం టీబీఎం నిపుణుల్లో, ఆపరేటర్లలో ఉత్సాహాన్ని నింపింది. మిగిలిన సీపేజ్‌ను కూడా ప్రీ ఫ్యాబ్రికేటెడ్ కాంక్రీట్ బ్లాక్స్, కెమికల్ గ్రౌటింగ్‌లతో అరికట్టగలమనే నమ్మకంతో పనులు కొనసాగిస్తుండగా ఒక్కసారిగా ఊహకందని పెను ప్రమాదం క్షణాల్లో జరిగింది. కట్టర్ పనిచేస్తున్న వ్యక్తి అరుపులతో ఒక్కసారిగా అప్రమత్తమైన సుమారు 42 మంది కార్మికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వరదతో పోటీ పడుతూ వేగంగా 3 కి.మీ. పరిగెత్తి ప్రాణాలు కాపాడుకున్నారు. టీబీఎం ఇంజిన్‌లో చిక్కుకున్న ఆపరేటర్ మరో ఏడుగురు మాత్రం బయటకు వచ్చే అవకాశం లేక లోపలే జలసమాధి అయి ఉండవచ్చునని వారి సహచరులు భావిస్తున్నారు. సీపేజ్ జరిగిన ప్రదేశానికి మరోవైపున వారు చిక్కుకున్నారు.

సొరంగాల నిర్మాణంలో ఇలాంటి ప్రమాదాలు ప్రతి దేశంలోనూ జరుగుతూనే ఉన్నాయి. 40 వేలకు పైన సొరంగాలను తవ్విన చైనా దేశంలో 2010-2020 మధ్యకాలంలో 48 ప్రమాదాలు జరిగాయి. (ముగ్గురి కన్నా ఎక్కువ మంది మరణించిన ప్రమాదాలు). సబ్‌వే టన్నెల్స్ నిర్మాణంలో 2003-2011 మధ్యకాలంలో చైనాలో 89 ప్రమాదాలు జరిగాయి. 210 మేజర్ టన్నెల్ ప్రమాదాలు ప్రపంచవాప్తంగా జరిగినట్టు 2004లో ఒక సర్వే ద్వారా వెల్లడైంది. ఫ్రాన్స్, జర్మనీ, స్విట్జర్‌లాండ్, ఇటలీ దేశాల్లో సొరంగాల త్రవ్వకం సమయంలో భారీ ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాలకు కారణం భూగర్భంలోని క్లిష్టమైన భూ భౌతిక స్థితి, రాతి పొరల గురించి స్పష్టమైన అవగాహన లేకపోవడమే.

శ్రీశైలం టన్నెల్‌లో పైన ఉన్న భూ భౌతిక స్థితి పట్ల కచ్చితమైన అవగాహన లేనందున ఈ ప్రమాదం ఎలా జరిగిందో బ్యారేజీ పియర్స్ కింద అట్టడుగు భూమి పొరల భౌతిక స్థితి పట్ల అవగాహన లేనందునే మేడిగడ్డ వద్ద ప్రమాదం జరిగింది. ఎన్‌జీఆర్‌ఐ వంటి సంస్థల వద్ద గల అత్యాధునిక పరికరాలు కూడా భూ భౌతికస్థితి పట్ల కచ్చితమైన అవగాహనను కొన్నిసార్లు అందించలేకపోవచ్చు. శ్రీశైలం టన్నెల్ ప్రమాదానికి కారణమైన భారీ సీపేజ్ (ఊటలు)కు కారణం భూమిపై పొరల మీద ఉన్న జలాశయం కావచ్చు లేదా దట్టమైన నల్లమల అడవుల్లో కురిసే భారీ వర్షాల వల్ల భూమి లోపలి పొరల్లో నిలిచిన సబ్ సర్ఫేస్ నీటి నిల్వకు టీబీఎం తవ్వకాల వల్ల గండి పడినందువల్ల కావచ్చు లేదా మట్టి పొరల్లో ప్రవహించే జలధారలు (ఆక్విఫర్స్) కావచ్చు. పైభాగంలో టైగర్ రిజర్వ్ ప్రాంతం, ఎత్తయిన కొండలు ఉన్నందున సర్వే సమయంలో ఈ ప్రాంత భూ భౌతిక స్థితిని అంచనా వేయడంలో స్పష్టత రాలేదని భావించాలి. మేడిగడ్డదైనా, శ్రీశైలం టన్నెల్ ప్రమాదమైనా ప్రకృతి వైపరీత్యాలుగానే భావించాలి తప్ప రాజకీయ విమర్శలకు తావివ్వకూడదు.

**శ్రీశైలం ఎడమగట్టు కాల్వ సొరంగం తవ్వకం పనుల్లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం నిధులివ్వక నిర్లక్ష్యం చేసిందని కాంగ్రెస్ పెద్దలు ఆరోపణలు చేస్తున్నారు. ఇవి పూర్తిగా నిరాధారం. కాంగ్రెస్ పాలనలో వైఎస్ఆర్ నుంచి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాల వరకు (1-6-2014 దాకా) ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టుపై చేసిన వ్యయం రూ.1248.14 కోట్లు కాగా గత పదేండ్ల కాలంలో చేసిన వ్యయం రూ.1,117.72 కోట్లు.**

2014 వరకు 22.89 కి.మీ. టన్నెల్ తవ్వకం పనులు జరుగగా స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తవ్వింది 11.48 కి.మీ. టీబీఎం టన్నెల్ పనులకే కాకుండా శ్రీశైలం ఎడమకాల్వ ప్రాజెక్టునందలి మొత్తం పనుల కోసం (మరో 7.2 కి.మీ. టన్నెల్‌తో సహా) చేసిన వ్యయం 1-6-2014 నాటికి రూ.3340.90 కోట్లు కాగా గత పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన వ్యయం రూ.3892.50 కోట్లు. ఇప్పటివరకైన మొత్తం వ్యయం రూ.7233.40 కోట్లు. వైఎస్ఆర్ ప్రభుత్వం 'జలయజ్ఞం'లో భాగంగా ప్రారంభించిన ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2005లో రూ.2813 కోట్లు 2021 నాటికి సవరించిన అంచనాల ప్రకారం రూ.9294.22 కోట్లు. ప్రస్తుతం ఇది రూ.12 వేల కోట్లు దాటి ఉంటుంది. ఈ ప్రాజెక్టులో భాగమైన 2వ టన్నెల్ పొడవు 7.13 కి.మీ. (8.76 వ్యాసం). డిండి, పెండ్లిపాకల వాగుల మధ్య ఈ సొరంగాన్ని టీబీఎం అవసరం లేకుండా మాన్యువల్‌గా (డ్రిల్ బ్లాస్ట్ పద్ధతిలో) నిర్మించారు. దీనిలో 3.32 కి.మీ. లైనింగ్ పనులు పూర్తయినవి. మేడిగడ్డ, ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదాల, అంచనా వ్యయం పెరగడం విషయంలో కాంగ్రెస్ నాయకులది రెండు నాల్కల ధోరణి అనేది స్పష్టమవుతున్నది. ఎస్‌ఎల్‌బీసీలో ఇరవై ఏండ్ల జాప్యం కాళేశ్వరంలో కూడా జరిగి ఉంటే దాని వ్యయం లక్షా ఇరవై ఏడు కోట్లకు బదులు మూడు లక్షల కోట్లు దాటి ఉండేది. అప్పట్లోనే (1954-55) తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కె.ఎల్ రావు కుట్రలకు లోనవకుండా ఏలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని కొనసాగించి ఉంటే ఈ దిక్కుమాలిన శ్రీశైలం టన్నెల్స్ ప్రాజెక్ట్ గానీ, ఎత్తిపోతలు గానీ అవసరం లేకపోయేవి. వేలాది నల్గొండ బిడ్డలు తిరుపతమ్మ, అంశుల స్వామి వలె ఫ్లోరోసిస్ బారిన పడకుండా ఉండేవాళ్లు. ఏలేశ్వరం నుంచి ప్రవాహ కాల్వల ద్వారా నల్గొండ, వరంగల్ ఖమ్మం జిల్లాల్లోని సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరంది ఉండేది. తెలంగాణ సోయితో ఉద్యమాల ద్వారా రాష్ట్రాన్ని సాధించిన ప్రజానీకం కాంగ్రెస్ నాయకుల అబద్ధాల ప్రచారాలకు లోనుకాకుండా ఉండాలంటే కాస్త నీళ్ల సోయి కూడా పెంచుకోవాలి. అప్పుడే మనం ఆశించిన గోదావరి, కృష్ణమ్మలు మన బీళ్లను తడుపుతూ పచ్చని మాగాణాల్లో పసిడి సిరులు పండిస్తాయి.

**(వ్యాసకర్త: మాజీ చైర్మన్, తెలంగాణ జల వనరుల అభివృద్ధి సంస్థ)**

**శ్రీశైలం టన్నెల్‌లో పైన ఉన్న భూ భౌతిక స్థితి పట్ల కచ్చితమైన అవగాహన లేనందున ఈ ప్రమాదం ఎలా జరిగిందో బ్యారేజీ పియర్స్ కింద అట్టడుగు భూమి పొరల భౌతిక స్థితి పట్ల అవగాహన లేనందునే మేడిగడ్డ వద్ద ప్రమాదం జరిగింది. ఎన్‌జీఆర్‌ఐ వంటి సంస్థల వద్ద గల అత్యాధునిక పరికరాలు కూడా భూ భౌతికస్థితి పట్ల కచ్చితమైన అవగాహనను కొన్నిసార్లు అధిగమించలేకపోవచ్చు.**

**ఎన్కటికొగడు సూర్యుడిపై కోపంతో దాన్ని మాయం చేయాలనుకున్నాడట. చంద్రుడిపై పగతో దాన్ని కనుమరుగు చేయాలని ప్రయత్నించాడట. సంద్రంపై ద్వేషంతో దానిముందు విర్రవీగాడంట. సూర్యున్ని మాయం చేయడం, చంద్రుని కనుమరుగు చేయడం, సంద్రాన్ని లేకుండా చేయాలనుకోవడం సాధ్యపడుతుందా? అలాగే చరిత్ర పుటలకు పట్టిన చెదను దులిపి తెలంగాణ చరిత్రను తిరగరాసిన కేసీఆర్ చరితను మాయం చేయడం సాధ్యపడుతుందా? ఆ దిశగా ప్రయత్నం చేయడమూ మూర్ఖత్వమే అవుతుంది.**

# నిలువెల్లా విషమే...



**నన్నపునేని నరేందర్**

సూర్యుడు మబ్బుల మాటున దాగినంత మాత్రాన మాయం చేశానని విర్రవీగడం, అమావాస్య నాడు చంద్రుడు కనిపించనంత మాత్రాన కనుమరుగు చేశానని గప్పాలు కొట్టడం, సంద్రపు అలలు వెనక్కి వెళ్లినంత మాత్రాన నన్ను చూసి భయపడిందని ప్రగల్భాలు పలకడం ఎంతటి అవివేకమో.. కేసీఆర్ ఒకడుగు వెనక్కు వేసినంత మాత్రాన చరిత్రను చెరిపేస్తామని విర్రవీగడం కూడా అంతే అవివేకం.

ఆరు గ్యారెంటీల పేరిట అబద్ధాలు, మోసపూరిత హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టించి ముఖ్యమంత్రి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి మొదటి నుంచి కేసీఆర్‌పై అవాకులు, చెవాకులు పేలుతున్నారు. నడమంత్రపు సిరి ఎక్కువ కాలం నిలువదన్నట్టు.. అనుకోకుండా అందివచ్చిన సీఎం కుర్చీ ఆయనకు నెత్తి మీద కండ్లను మొలిపించి కుదురుగా కూర్చోనివ్వడం లేదు. అందుకే, కేసీఆర్ ఆనవాళ్లను కనుమరుగు చేస్తానని, ఆయన చరిత్రను చెరిపేస్తానని మాట తూలుతున్నారు. ఆచరణకు సాధ్యం కాని శపథాలు చేస్తున్నారు.

దేశంలో చాలామంది చాలా రాష్ట్రాలకు ముఖ్యమంత్రులయ్యారు. కానీ, కేసీఆర్ మాత్రం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి చరిత్ర పుటల్లోకి ఎక్కించారు, ప్రపంచ పటంపై నిలిపారు. ఆ రాష్ట్రానికే ఇప్పుడు తాను సీఎం అయ్యాననే విషయం రేవంత్‌రెడ్డి మర్చిపోతున్నారు. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. కేసీఆర్ రాసిన చరిత్రను చెరపడం ఎలాగో సాధ్యం కాదని తెలిసీ.. ఆయన సాధించిన అభివృద్ధి నివేదికలను కనుమరుగు చేస్తున్నారు. ప్రగతి ఫొటోలను మాయం చేస్తున్నారు. ఇప్పటికే కేసీఆర్ సర్కార్ సాధించిన అనేక అవార్డులు, రివార్డులకు సంబంధించిన డేటాను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నుంచి తొలగించేశారు. కులగణన సర్వే తప్పులు బయటపడటంతో కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వేను ప్రత్యర్థులు సహా అందరూ మెచ్చుకున్నారు. దీంతో సమగ్ర కుటుంబ సర్వే వివరాలను కానరాకుండా చేశారు. ఆఖరికి కాంగ్రెస్ సర్కార్ ఇటీవల విడుదల చేసిన సామాజిక, ఆర్థిక నివేదిక (అట్లాస్) కూడా కేసీఆర్ ప్రభుత్వం సాధించిన ప్రగతికి పట్టం గట్టింది. ఆ నివేదిక బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధికి దర్పణం పట్టింది. అందులోని మొదటి పుట నుంచి చివరి పుట వరకు కేసీఆర్ అమలుచేసిన పథకాలను కండ్లకు కట్టింది. దీంతో సెల్ఫ్‌గోల్ అయిందని తెలుసుకున్న రేవంత్‌రెడ్డి.. వెంటనే దాన్ని కూడా ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి మాయం చేసేశారు.

**కేసీఆర్‌ను చూస్తేనే రేవంత్ రెడ్డికి బుర్ర పనిచేయడం లేదేమో. అందుకే ఆయనకు సంబంధించిన వివరాలు ఎక్కడ కనిపించినా వెంటనే డిలీట్ చేయిస్తున్నారు. ఆఖరికి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలనూ వదల్లేదు. కేటీఆర్ ఫొటో పెట్టుకున్నాడని టీ స్టాల్‌ను తొలగించడం రేవంత్ రెడ్డి విద్వేషానికి, నియంతృత్వానికి పరాకాష్ఠ.**

దేశాన్ని ఐదు దశాబ్దాలకు పైగా పాలించిన కాంగ్రెస్ పార్టీ తనకు నచ్చినట్టుగా చరిత్రను నిర్మించుకున్నది. ఇప్పుడు బీజేపీ పాలకులు దాన్ని చెరిపే క్రమంలో తాము చెప్పిందే చరిత్ర అంటున్నారు. ఆ క్రమంలోనే చరిత్రను వక్రీకరిస్తూ పలు సినిమాలు కూడా తీస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ మూలాలున్న రేవంత్ రెడ్డి వారి బాటలోనే నడుస్తున్నారు. అయితే కేసీఆర్ చరిత్రను చెరిపేయడానికి అది శతాబ్దాల కిందట జరిగింది కాదు. మనందరి కండ్లముందే దశాబ్దాల కిందట జరిగింది. రేవంత్‌రెడ్డి ఒక విషయం గుర్తుంచుకోవాలి. వెబ్‌సైట్‌లో వివరాలు తొలగించినంత మాత్రాన కేసీఆర్ చరిత్ర చెరిగిపోదు. ఆయన తెలంగాణ ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచి ఉంటారు.

**(వ్యాసకర్త: మాజీ ఎమ్మెల్యే వరంగల్)**



**నర్మాల పరంధాములు**

# ఆయన పిలుపే ఓ ప్రభంజనం

వలసాంధ్రుల పాలనా కాలంలో తెలంగాణ ప్రజలు అరిగోస పడ్డరు. ఆ అరువై ఏండ్ల కన్నీళ్లను, కష్టాలను చూడలేక తెలంగాణ ప్రాంతం ఓ బిడ్డను కన్నది. దాని పేరే టీఆర్ఎస్. తెలంగాణ తల్లి విముక్తి కోసం పద్నాలుగేండ్ల పాటు అహర్నిశలు కృషిచేసిన టీఆర్ఎస్ ఆఖరికి అనుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది. 'తెలంగాణ జీవనయానాన్ని, టీఆర్ఎస్ పుట్టుక, ప్రస్థానాన్ని వేర్వేరుగా చూడలేం. ఆ రెండూ ఒక్కటే...' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పిన ఈ మాటలు అక్షర సత్యాలు. బీఆర్ఎస్ దిశను, తెలంగాణ దశను ఎన్నటికీ వేరు చేసి చూడలేం. తెలంగాణ అస్తిత్వం కోసం పుట్టిన పార్టీగా టీఆర్ఎస్ తన తల్లి తెలంగాణకు పునర్జన్మనిచ్చేందుకు తన ఉనికిని పణంగా పెట్టి, ఎన్నోసార్లు పురిటి నొప్పులను భరించింది. ఆ నొప్పుల వెనుక ఉన్న బాధేమిటో అనుభవించిన తల్లికే తెలుస్తుంది కానీ, మంత్రసానికి తెలువదు.

**తెలంగాణ బాధే... టీఆర్ఎస్ గాథ. టీఆర్ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ బాధల్లోంచి, తెలంగాణ ప్రజల కన్నీటి గాథల్లోంచి. తెలంగాణకు కష్టం వస్తే బీఆర్ఎస్ కండ్లు చెమ్మగిల్లుతయి. తెలంగాణ కాలికి ముల్లు గుచ్చుకుంటే బీఆర్ఎస్ విలవిల్లాడుతుంది. రెండున్నర దశాబ్దాల కిందట పురుడుపోసుకున్న బీఆర్ఎస్ అధికారంతో సంబంధం లేకుండా ఇప్పటికీ తెలంగాణ రక్షణ, తెలంగాణ ప్రాంత ప్రయోజనాల కోసమే పరితపిస్తున్నది.**

ఆరు దశాబ్దాల పాటు ఉమ్మడి భారాన్ని తన ఎదపై మోసి తెలంగాణ తల్లి గుండె బరువెక్కింది. మన సొమ్ముతో పరాయివాళ్లు పంచభక్ష్య పరమాన్నాలు తింటుంటే, సొంత బిడ్డలు పస్తులుండటాన్ని జూసి తెలంగాణ తల్లి కంట నీరింకిపోయింది. దాస్యశృంఖలాల సంకెళ్లను మోసి చేతులు కందిపోయినయి. పరాయి ప్రజల బతుకులకు కాపలా కాసి, ఉమ్మడి బరువును మోసి భుజాలు బరువెక్కిన సమయంలో చరిత్ర గర్భాన్ని చీల్చుకుంటూ కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ పురుడు పోసుకున్నది. నాటినుంచి తెలంగాణ తల్లి మోస్తున్న బరువును దించేందుకు, దాస్యశృంఖలాల సంకెళ్లను తెంచేందుకు టీఆర్ఎస్ చేయని ప్రయత్నం లేదు, తొక్కని గడప లేదు, వేయని అడుగు లేదు, సలపని పోరాటం లేదు. ఈ పార్టీకి తప్ప, మిగతా ఏ రాజకీయ పార్టీకి కూడా తెలంగాణ సోయి లేదనడంలో అతిశయోక్తి లేదు.

తెలంగాణ బతుకు మార్చేందుకు, ప్రజల జీవితాన్ని చక్కదిద్దేందుకు జరిగిన మహోజ్వల యజ్ఞంలో టీఆర్ఎస్ మొదట తానే సమిధ అయింది. తెలంగాణ ప్రజలకు కష్టం వస్తే కన్నీరు తీసింది. తెలంగాణకు నష్టమని తెలిస్తే నిప్పుకనికై మంట పుట్టించింది. 2001, ఏప్రిల్ 27న చిన్న కుటీరంలో పురుడు పోసుకున్న టీఆర్ఎస్.. 2014 జూన్ 2న తెలంగాణకు పురుడుపోసింది.

పద్నాలుగేండ్ల సుదీర్ఘ ఉద్యమంలో ఎన్నో కొత్త పోరాట రూపాలకు టీఆర్ఎస్ జీవం పోసింది. సాగరహారం, మిలియన్ మార్చ్, సకలజనుల సమ్మె, వంటావార్పు, పల్లెనిద్రలు, సైకిల్ యాత్రలు లాంటి ఎన్నో శాంతియుత ఉద్యమాలకు ముగ్గుపోసింది. అంతే కాదు, బరిగీసి కొట్లాడింది. నిరుద్యోగుల నుంచి ఉద్యోగుల వరకు, బస్సు డ్రైవర్ల నుంచి ఎయిర్ బస్ పైలెట్‌ల వరకు, విద్యార్థుల నుంచి అధ్యాపకుల వరకు, పిల్లాజెల్ల నుంచి ముసలీ ముతక వరకు అందర్నీ ఏకం చేసింది టీఆర్ఎస్సే. నీళ్లు, నిధులు, నియామకాల నినాదాన్ని తన విధానంగా మార్చుకొని పోరు బరిలో నిలిచింది, ప్రజలను నిలిపింది. పదవుల కోసం ఆరాటపడకుండా నిత్య పోరాటం చేసింది. అదరక, బెదరక కదనరంగంలో కాలుదువ్వి తెలంగాణను సాధించి విజయనాదం చేసింది.

కొట్లాడి సాధించుకున్న తెలంగాణను కేంద్రంతో పోట్లాడి మరీ అభివృద్ధి చేసింది. ప్రజలను ప్రగతిపథంలో నడిపించింది. తెలంగాణ ప్రగతి రథచక్రాలను పరుగులు పెట్టించింది. ఉద్యమకాలంలో తెలంగాణ ప్రజల కష్టాలను, కడగండ్లను కండ్లారా చూసిన కేసీఆర్.. స్వరాష్ట్రం సాధించాక ఆ కష్టాలను కనుచూపు మేరలో కనిపించకుండా అధఃపాతాళంలో పాతిపెట్టారు. కానీ, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ కష్టాలను బుల్డోజర్లు పెట్టి మరీ తవ్వుతున్నది. ప్రజలను నష్టాల పాలు చేస్తున్నది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ తల్లి మరోసారి తను కన్నబిడ్డ బీఆర్ఎస్‌ను తలచుకుంటున్నది. తనను బాధ పెడుతున్న సవతి బిడ్డ చెర నుంచి విడిపించాలని మొర పెట్టుకుంటున్నది. తన బిడ్డలకు ఏదైనా కష్టం వచ్చిందని తెలిస్తే కేసీఆర్ ఆలోచిస్తారేమో గానీ, తెలంగాణ తల్లికి కష్టం వచ్చిందని తెలిస్తే మాత్రం అరక్షణం కూడా ఆలోచించరు. క్షణాల్లో ఆ కష్టానికి ఎదురుగా నిలుచుంటారు. కాంగ్రెస్ హయాంలో తెలంగాణ పడుతున్న కష్టాలను చూడలేక బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం రూపంలో కేసీఆర్ సమరశంఖం పూరించారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను సమాయత్తం చేశారు. ఎన్నో ఘన విజయాలు సాధించిన టీఆర్ఎస్ పార్టీ... ఆవిర్భావ రజతోత్సవాలను ఎంతో ఉత్సాహంగా జరుపుకోవాల్సిన సమయం ఇది. అయినప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం తమ అధినాయకుడు కేసీఆర్ పూరించిన సమరశంఖనాదంతో బీఆర్ఎస్ శ్రేణులు మళ్లీ ఉద్యమోత్సాహమే ఊపిరిగా ఉరకలెత్తుతున్నాయి.




**(వ్యాసకర్త: ఇండిపెండెంట్ జర్నలిస్ట్)**